# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

Bullet Edition

బుధవారం, 10 జూలై 2024 | www.prajaaswaramdaily.com | 4 PM




# రాష్ట్రంలో సంక్షేమమే లేదు

## కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 10 (ప్రజాస్వరం)
రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు అమలు కావడం లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని అంబర్‌పేట్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో చాలా సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. పలు ప్రాంతాల్లో స్ట్రీట్ లైట్స్ వేసేందుకు జీహెచ్ఎంసీ డబ్బు లేదని చెప్పడం విడ్డూరమని విమర్శించారు. పదేళ్లు అధికారంలో ఉన్నా బీఆర్ఎస్ ప్రజలకు రేషన్ కార్డులు ఇవ్వలేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో కొత్త రేషన్ కార్డులు ఇస్తామన్న కాంగ్రెస్ కూడా ఇవ్వలేదని చెప్పారు. 2004లో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి ఇచ్చిన రేషన్ కార్డులు తప్ప.. ఇప్పటి వరకు కొత్త రేషన్ కార్డులు రాష్ట్రంలో ఎవ్వరికీ అందలేదని పేర్కొన్నారు. రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో బీజేపీ ప్రభుత్వం ఇస్తున్న ఐదు కేజీల ఉచిత బియ్యం అందడం లేదని పేర్కొన్నారు. అలాగే పొదుపు సంఘాల్లో చేరలేక పోతున్నారని, కొత్త గ్యాస్ కనెక్షన్ తీసుకోలేక పోతున్నారని తెలిపారు. నెలలు గడుస్తున్నా ధ్వంసమైన రోడ్లను రిపేర్ చేయడం లేదని మండిపడ్డారు. డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇస్తామని చెప్పిన కేసీఆర్ ఫామ్‌హౌస్ వెళ్లాడని.. కొత్త ప్రభుత్వం ఉలుకు పలుకు లేదని దుయ్యబట్టారు. కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని, కాలేజీకి వెళ్లే మహిళలకు ఎలక్ట్రిక్ స్కూటీ ఇస్తానన్న హామీలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హైటెక్ సిటీ లేదు.. హైదరాబాద్ లేదని, అభివృద్ధి వదిలేసి రియల్ ఎస్టేట్ దగ్గర వసూళ్లు చేస్తున్నాని ఆరోపించారు. కనీస సమస్యలపై పట్టించుకునే నాయకుడు హైదరాబాద్‌లో లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# వివాహ భోజనం.. అధ్వానం!

## హీరో సందీప్ కిషన్ రెస్టారెంట్ లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ

హైదరాబాద్, జూలై 10 (ప్రజాస్వరం): టాలీవుడ్డ్ రో సందీప్ కిషన్ రెస్టారెంట్ 'వివాహ భోజనంబు' సికింద్రాబాద్ బ్రాంచ్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పాడైపోయిన బియ్యం, నాసిరకపు ఆహార పదార్థాలను ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. హోటల్లో 2022 నాటికే గడువు ముగిసిన 25 కిలోల చిట్టిముత్యాల రైస్ బ్యాగ్, సింథటిక్ ఫుడ్ కలర్స్ గుర్తించారు. కిచెన్ ఆవరణ అపరిశుభ్రంగా ఉన్నట్టు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. హోటల్‌పై అధికారులు కేసు నమోదు చేశారు.





# తెలంగాణ నూతన డీజీపీగా జితేందర్

## ఉత్తర్వులు జారీ చేసిన సర్కార్

హైదరాబాద్, జూలై 10, (ప్రజాస్వరం): తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర నూతన డీజీపీగా 1992 బ్యాచ్ కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి జితేందర్ ను నియమించింది. ప్రస్తుత డీజీపీ రవి గుప్తాను హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా బదిలీ చేసింది. ఈ మేరకు బుధవారం సీఎస్ శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. నూతన డీజేపీగా నియామకమైన జితేందర్ ప్రస్తుతం హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా, ఇటీవల రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో శాంతి భద్రతలు క్షీణించాయని పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తున్న విషయం తెలిసిందే. నగరంలో రోజుకో మర్డర్.. వారానికో అత్యాచారం జరుగుతోందని.. రాజధానిలో క్రైమ్ రేట్ విపరీతంగా పెరిగిందని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వంపైన ప్రతిపక్షాలు విమర్శలతో విరుచుకుపడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం డీజీపీని బదిలీ చేసినట్లు తెలుస్తోంది.

టీఆర్ఎస్ మళ్లీ సెంటిమెంట్ రాజకీయాలకు తెరలేపనుందా..? జాతీయ రాజకీయాలంటూ పార్టీ పేరు మార్చుకొని బీఆర్ఎస్ గా అవతరించిన గులాబీ పార్టీ పీఛేముడ్ అననుందా..? ప్రజలతో ఏర్పడ్డ గ్యాప్ పూడ్చేందుకు అధినేత ప్రయత్నాలు ప్రారంభించారా...? అంటే ఇటీవల పార్టీలో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఔననే సమాధానమే వస్తోంది. భారత రాష్ట్ర సమితి పేరు తెలంగాణ రాష్ట్ర సమితిగా మార్చాల్సిందే అంటూ కొంతకాలంగా పార్టీలో అంతర్గతంగా నేతలు, కార్యకర్తల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. దీంతో ఆలోచనలో పడిన కేసీఆర్.. భారత రాష్ట్ర సమితి పేరును మళ్లీ టీఆర్ఎస్గా మార్పు చేసేందుకు సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. త్వరలోనే ఎన్నికల సంఘాన్ని కలిసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు తెలుస్తోంది. అంతేగాక ప్రజలకు విశ్వాసం కల్పించేందుకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాదయాత్ర చేయనున్నారనే ప్రచారం కూడా పార్టీలో సాగుతోంది.




# కారు రివర్స్!

## మళ్లీ తెలంగాణ రాష్ట్ర సమితిగా పేరు మార్చే యోచన

బీఆర్ఎస్ పేరు మార్పుపై అధినేత మంత్రాంగం
సాధ్యాసాధ్యాలపై ముఖ్య నేతలతో సమాలోచనలు
త్వరలోనే ఎన్నికల సంఘాన్ని కలిసేందుకు యోచన

హైదరాబాద్, జూలై 10, (ప్రజాస్వరం) : అసెంబ్లీ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి పేరిట ఎన్నికలకు వెళ్లిన బీఆర్ఎస్ అధికారం కోల్పోయింది. 39 ఎమ్మెల్యే సీట్లు గెలిచి ప్రతిపక్షానికి పరిమితమైంది. ఇందులో కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత ఓటమి.. ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ కు చెందిన శ్రీగణేశ్ గెలుపుతో.. బీఆర్ఎస్ బలం కాస్తా.. 38కి పడిపోయింది. తర్వాత జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవకపోవడం 15 చోట్ల మూడోస్థానానికి పడిపోవడం.. చాలా స్థానాల్లో డిపాజిట్లు కోల్పోవడంతో కారు పార్టీ ఉక్కిరి బిక్కిరయ్యింది. గెలిచిన ఎమ్మెల్యేల్లో ఇప్పటి వరకు ఏడుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలాగే ఆరుగురు ఎమ్మెల్సీలు కూడా హస్తం పార్టీలో చేరారు. వరుస వలసలు గులాబీ అధినేతకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇవాళ తనతో సమావేశానికి హాజరైన వారు తెల్లారేసరికి కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అవుతుండడాన్ని గులాబీ బాస్ జీర్ణించుకోలేక పోతున్నారట. దాదాపు రెండు దశాబ్దాలకు పైగా కలిసొచ్చిన టీఆర్ఎస్ ను బీఆర్ఎస్ గా మార్చడం ద్వారా ప్రజలతో గ్యాప్ ఏర్పడిందని పార్టీ నాయకత్వం భావిస్తున్నదని సమాచారం. ఇవాళ ఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలోనూ మాజీ మంత్రి కేటీఆర్ ఇదే అంశాన్ని ప్రస్తావించారు. తాము చేసిన అభివృద్ధి కన్నా సెంటిమెంటే విజయతీరాలకు నడిపిస్తుందని గులాబీబాస్ గట్టిగా నమ్ముతున్నారని సమాచారం. బీఆర్ఎస్ ను టీఆర్ఎస్ గా మార్చడం ప్రజలు పార్టీని ఓన్ చేసుకుంటారని కేసీఆర్ అనుకుంటున్నారని తెలుస్తోంది. విభజన అంశాలను, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను తెరమీదకు తెచ్చి పార్టీని ప్రజల్లో ఉంచేందుకు టీఆర్ఎస్ గా మార్చడమే ఏకైక పరిష్కారమని భావిస్తున్నట్టు తెలుస్తోంది.

# యూపీలో ఘోర ప్రమాదం

## 18 మంది దుర్మరణం..

## 19 మందికి తీవ్ర గాయాలు

లక్నో, జూలై 10, (ప్రజాస్వరం) : ఉత్తర్ ప్రదేశ్ లోని ఉన్నావ్ లో ఈ ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగ్రా-లక్నో ఎక్స్ ప్రెస్ హైవేపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 18 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 19 మంది తీవ్రంగా గాయపడ్డారు. బీహార్ లోని సీతామర్హి నుంచి ఢిల్లీ వెళ్తున్న డబుల్ డెక్కర్ స్లీపర్ బస్సు ఈ తెల్లవారుజామున ఉన్నావో వద్ద పాల ట్యాంకర్ ను వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో బస్ మొత్తం కంటైనర్ లోకి దూసుకెళ్లడంతో ఘోరం జరిగిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. బస్సులో ఇరుకున్న వారిని బయటకు తీశారు. బెహతా ముజావర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గర్హా గ్రామం వద్ద ఈ ప్రమాదం జరిగింది.



# ఎమ్మెల్యే పీఏతో నాకు ప్రాణహాని

## హైకోర్టు ఎదుట న్యాయవాది ఆందోళన

హైదరాబాద్, జూలై 10 (ప్రజాస్వరం): కాంగ్రెస్ ఎమ్మెల్యే గడ్డం వినోద్ పీఏ గడ్డం ప్రసాద్‌తో తనకు ప్రాణ హాని ఉందని బెల్లంపల్లికి చెందిన న్యాయవాది, నాలుగు నెలల గర్భిణి గడవీణ మమత తెలంగాణ హైకోర్టు ఎదుట తన మూడేళ్ల పాపతో నిరసన తెలిపింది. బెల్లంపల్లి పట్టణంలోని రైల్వే రడగంబాల బస్తీకి చెందిన చిప్పరి విక్టోరియా అనే మహిళ భర్త ఉండగానే ఒంటరి మహిళా పింఛన్ పొందుతున్నదని కలెక్టర్‌కు మమత ఫిర్యాదు చేసింది. దీంతో పగ పెంచుకున్న విక్టోరియా కుటుంబ సభ్యులు తనపై దాడి చేశారని, ఎమ్మెల్యే గడ్డం వినోద్ పీఏ గడ్డం ప్రసాద్ బెల్లంపల్లిలో తిరగనివ్వనని, చంపేస్తానని ఫోన్‌లో బెదిరిస్తున్నట్లు మమత వాపోయింది.



# ఓయూలో హైటెన్షన్

## విద్యార్థి సంఘాల నాయకులు, జర్నలిస్టుల అరెస్ట్

హైదరాబాద్, జూలై 10, (ప్రజాస్వరం): ఉస్మానియా యూనివర్సిటీలో ఉద్రక్త వాతావరణం చోటు చేసుకుంది. ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ విద్యార్థి సంఘం నాయకులపై పోలీసులు లాఠీ చార్జ్ చేశారు. డీఎస్సీ పరీక్షను వాయిదా వేయాలని బుధవారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలోబీఆర్ఎస్ విద్యార్థి సంఘాలు ఆందోళన నిర్వహించాయి. ఓయూ పోలీస్ స్టేషన్ కు చెందిన పోలీసులు అక్కడికి చేరుకుని విద్యార్థి సంఘం నాయకులపై పోలీసులు లాఠీలు ఝులిపించారు. విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి, ఓయూ పోలీస్ స్టేషన్ కు తరలించారు. అంతేగాక న్యూస్ కవర్ చేసేందుకు వెళ్లిన మీడియా ప్రతినిధులపై పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. జర్నలిస్టులమని చెబుతున్న సరే వినకుండాఅరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.

## జాతీయ రహదారులపై

# సీఎం రేవంత్ సమీక్ష

హైదరాబాద్, జూలై 10 (ప్రజాస్వరం): నేషనల్ హైవేలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఇవాళ సచివాలయంలో జాతీయ రహదారుల ప్రాజెక్టులపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ రివ్యూ మీటింగ్ కు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీఎస్ శాంతికుమారి, జాతీయ రహదారులు నిర్మాణం సాగుతున్న ఆయా జిల్లాల కలెక్టర్లు, సంబంధింత ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ



సందర్భంగా జాతీయ రహదారుల ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ, పలు అంశాలపై సీఎం అధికారులను ఆరా తీసినట్లు తెలిసింది. జాతీయ రహదారుల సంస్థ ప్రాజెక్ట్స్ సభ్యుడు అనిల్ చౌదరి ఆధ్వర్యంలో అధికారుల బృందం నిన్న సీఎంతో భేటీ అయింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో చేపడుతున్న ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టుకు తోడ్పాటు అందించాలని సీఎం కోరారు.